సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం, 14, మార్చి, 2023



ఆలయాల్లో జీయర్ పూజలు

భద్రాచలం, అన్నపురెడ్డిపల్లి, కాకర్ల శ్రీ వేణు గోపాల స్వామి ఆలయాల్లో అహోబిల జీయర్‌స్వామి ప్రత్యేక పూజలు చేశారు. 10లో



డయల్ 100.. వెరీ స్లో !

100 నంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణమే పోలీసులు రావాల్సి ఉండగా, గంట తర్వాత కూడా చేరుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
39° / 20°

వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. రాత్రి పూట కూడా చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చి భక్తులను మురిపించారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం అశ్వారావుపేట మండలంలో పర్యటించనున్నారు. జమ్మిగూడెంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభిస్తారు. ఆ తర్వాత మండల కేంద్రంలోని పాత ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీఏ సబ్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొంటారని అధికారులు తెలిపారు.

నేటి నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

అశ్వాపురం: మండల పరిధిలోని కుమ్మరిగూడెంలో మిషన్ భగీరథ ఇంటేక్ వెల్‌లో పేరుకుపోయిన ఇసుక, సిల్ట్ తొలగింపు పనులు సోమవారం ప్రారంభించారు. పగలు సిల్ట్ తొలగింపు, రాత్రి నీరు పంపింగ్ పనులు చేస్తారు. దీంతో మంగళవారం నుంచి ఈనెల 29 వరకు 15 రోజుల పాటు పినపాక, అశ్వారావుపేట, ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందని మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. అయితే స్థానిక పంచాయతీ సిబ్బంది రోజు విడిచి రోజు నీరందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఆస్ట్రేలియా, యూఏఈల్లో ఉద్యోగావకాశాలు

సింగరేణి(కొత్తగూడెం): ఉపాధి కల్పన, శిక్షణ శాఖ అయిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యాన ఆస్ట్రేలియా, యూఏఈల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి వేల్పుల విజేత తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకునేందుకు ఈనెల 15న కలెక్టరేట్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వివిధ ఉద్యోగాల కోసం ఐటీఐ ఫిట్టర్ ట్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించి, ఈట్‌లో మార్కులు సాధించిన వారు, లేదంటే పదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో చదివి ఐటీఐ పూర్తిచేసిన 40 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 15న స్వయంగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఐదు నెలలు.. రూ.4.27 లక్షలు

- గణనీయంగా పెరిగిన గణేష్ టెంపుల్ హుండీ ఆదాయం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం పట్టణంలోని శ్రీ.విజయ విఘ్నేశ్వర స్వామి ఆలయం (గణేష్‌టెంపుల్)లో హుండీలను సోమవారం లెక్కించగా రూ.4,27,164 ఆదాయం లభించిందని ఈఓ కె.సులోచన తెలిపారు. ఐదు నెలల మూడు రోజులకు గాను ఈ మొత్తం వచ్చాయని పేర్కొన్నారు. నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు కూడా వచ్చాయని, వాటిని తిరిగి హుండీలోనే వేశామని తెలిపారు. నగదును బ్యాంక్‌లో జమ చేసినట్లు చెప్పారు. లెక్కింపు కార్యక్రమంలో కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజర్ ఎం.మణికంఠ, అసిస్టెంట్ మేనేజర్ డి.రవికుమార్, క్యాషియర్ ఎన్.నరేష్, పోలీస్ సిబ్బంది జి.అశోక్ కుమార్, బి.అనంతరాములు పాల్గొన్నారు.

బాలల హక్కుల శిక్షణకు హాజరు

చుంచుపల్లి: హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ బాలల హక్కుల సంరక్షణ కమిషన్, జీ- 20 సదస్సులో భాగంగా సోమవారం జరిగిన శిక్షణకు జిల్లా నుంచి ఇద్దరు డీఎల్‌పీఓలు, ముగ్గురు సర్పంచ్‌లు, ఐదుగురు కార్యదర్శులు వెళ్లారు. పంచాయతీ కార్యదర్శులు వంశీ కృష్ణ, బాలకృష్ణ, కృష్ణచైతన్య, వెంకట్, హైజర్‌ఖాన్, డీఎల్‌పీఓలు రమణ, పవన్, సర్పంచ్‌లు రాందాస్, చిన్న బ్బాయి, బాబూరావు హాజరయ్యారు.

బరాబర్ బరిలో.. !

రాబోయే ఎన్నికల్లో పోటీకి డీహెచ్ గడల ఆసక్తి

- మొదటి ప్రాధాన్యత గులాబీ పార్టీకే..
- బీఆర్ఎస్ టికెట్ రాకుంటే ప్రత్యామ్నాయంపై దృష్టి
- పోటీ ఖాయమంటున్న శ్రీనివాసరావు



సుజాతనగర్‌లో మెగా హెల్త్ క్యాంప్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు తదితరులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సేవా కార్యక్రమాలు, వివాదాస్పద వ్యాఖ్యలతో కొంతకాలంగా హాట్‌టాపిక్‌గా మారిన రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంచాలకులు గడల శ్రీనివాసరావు తెల్ల చొక్కా వదిలి ఖద్దరు చొక్కా ధరించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. పార్టీ ఏదైనా, ఫలితం ఎలా ఉన్నా సరే.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలవాల్సిందే అని గడల నిర్ణయించుకున్నట్టు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

సేవా కార్యక్రమాలతో..

జిల్లాకు చెందిన గడల శ్రీనివాసరావు అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ హోదాకు చేరుకున్నారు. కరోనా కాలంలో ఆయన రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం భవిష్యత్‌లో రాజకీయాల్లో రాణించాలనే ఉద్దేశంతో డీహెచ్ హోదాలో ఉంటూనే తన పేరు మీద జీఎస్సార్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ముఖ్యంగా కొత్తగూడెం నియోజకవర్గం కేంద్రంగా ఉద్యోగ మేళా, హెల్త్ క్యాంప్, మహిళా శక్తి తదితర సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆయన చేసిన కొన్ని పనులు, వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఏసుప్రభు వల్లే కరోనా నయం అయిందంటూ చేసిన కామెంట్లు, అంతకు ముందు సీఎం కేసీఆర్‌కు పదేపదే పాదాభివందనం చేయడం వంటి చర్యలతో తీవ్ర విమర్శల పాలయ్యారు. అయితే కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం ఒక్కసారి కాదు వందసార్లయినా సీఎం కేసీఆర్ కాళ్లు మొక్కుతానంటూ ఆ విమర్శలకు గడల ధీటుగా సమాధానం ఇచ్చారు. అదే సమయంలో రాబోయే ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి కారు గుర్తుపై పోటీ చేసేందుకు గడల ప్రయత్నాలు చేస్తున్నట్టు తేటతెల్లమైంది.

ఉద్యోగానికి రాజీనామా చేస్తా..

జిల్లాలో కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం ఒక్కటే జనరల్ కేటగిరీలో ఉంది. ఇక్కడి నుంచి బీఆర్ఎస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు ఉన్నారు. వనమాతో పాటు మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు సైతం ఇక్కడి నుంచి పోటీకి సిద్ధమవుతున్నారు. వీరిద్దరితో పాటు మరికొందరు బీఆర్ఎస్ నేతల పేర్లు ఆశావహుల జాబితాలో ఉన్నాయి. ఇంత తీవ్రమైన పోటీ ఉన్నా.. ఎక్కడా గడల శ్రీనివాసరావు వెనక్కు తగ్గినట్టు కనిపించడం లేదు. పైగా జిల్లాకు వచ్చిన ప్రతిసారీ ఏదో ఒక సందర్భంలో 'కేసీఆర్ ఆదేశిస్తే ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వస్తా' అంటూ పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. ప్రజాసేవలో ఉంటే రాజకీయాల్లో ఉన్నట్టే అంటూ కొత్త అర్థాలను కూడా వివరిస్తున్నారు.

సిట్టింగ్‌లకే సీట్లు..

ఇటీవల రాష్ట్ర కేబినెట్ సమావేశం సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో 99 శాతం సీట్లు సిట్టింగులకే కేటాయిస్తానంటూ ప్రకటించారు. ఎక్కడైనా వివాదాలు, ఇబ్బందులు ఉన్న చోట మార్పు విషయం ఆలోచిస్తామని తేల్చి చెప్పారు. సీఎం కేసీఆర్ తాజా ప్రకటన గడల శ్రీనివాసరావు రాజకీయ ఆశలపై నీళ్లు చల్లినట్టు అయింది. బీఆర్ఎస్ పార్టీలో ఓ కీలక నేత ఇచ్చిన హామీతోనే ఇన్నాళ్లూ గడల టికెట్‌పై నమ్మకం పెట్టుకున్నారు. దానికి తగ్గట్టుగానే విమర్శలకు వెరవక దూకుడుగా ముందుకు వెళుతున్నారు. ప్రస్తుతం గడలకు హామీ ఇచ్చిన కీలక నేత చుట్టూ వివాదాలు ముసురుకోవడం, మరోవైపు కేసీఆర్ సిట్టింగుల హామీతో గడల వ్యూహాలు చిక్కుల్లో పడ్డాయి.

పోటీలో ఉండాల్సిందే..

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీలో ఉండాల్సిందేనని గడల శ్రీనివాసరావు గట్టిగా నిర్ణయించుకున్నట్టు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. పోటీ చేసేందుకు మొదటి ప్రాధాన్యత బీఆర్ఎస్ పార్టీకేనని, అక్కడ సానుకూల ఫలితాలు రాకుంటే ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా కన్నేసి ఉంచారని సమాచారం. ఇందులో ముందుగా జిల్లాలో బలమైన ఓటు బ్యాంకు ఉన్న కాంగ్రెస్ వైపు గడల మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ కాకపోతే జాతీయ పార్టీ బీజేపీని ఆప్షన్‌గా పెట్టుకున్నట్టు వినికిడి. చివరకు ఇండిపెండెంట్‌గా అయినా సరే ఎన్నికల బరిలో నిలవాల్సిందే అన్నంత పట్టుదలగా ఉన్నట్టు ఆయన అనుచరులు అంటున్నారు. అందువల్లే ఎన్ని విమర్శలు, ఆరోపణలు చుట్టుముట్టినా వెనక్కు తగ్గకుండా కార్యక్షేత్రంలో ఆయన పని చేసుకుంటూ పోతున్నారని చెబుతున్నారు.

కలెక్టర్ సారూ... ఈ కన్నీళ్లు ఆపగలరా ?



కన్నీళ్లు తుడుచుకుంటున్న ఈమె పేరు టీపీ విజయ. ఒంటరి మహిళ. పెళ్లీడుకు వచ్చిన ఇద్దరు కుమార్తెలతో కలిసి అశ్వాపురం మండలం జగ్గారం క్రాస్‌రోడ్‌లో ప్రమాదకర పరిస్థితుల్లో నివసిస్తోంది. తమ స్థలం కబ్జాకు గురవుతోందని, తాను, తన ఇద్దరు ఆడ బిడ్డలు ఉన్న ఒక్క ఆధారం కోల్పోయి రోడ్డున పడతామని, తమను ఆదుకోవాలని కలెక్టర్‌కు ఏడాది కాలంలో 16 సార్లు దరఖాస్తు చేసుకుంది. పై స్థాయిలో అధికారులు ఆమె ఇబ్బందులు గుర్తించి న్యాయం చేయాలంటూ క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఆ ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. కనీసం ఈసారైనా తనకు అధికారులు న్యాయం చేస్తారా అంటూ సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో కన్నీరు పెట్టుకుంది.

- కబ్జాలో పేద మహిళ ఇంటి స్థలం
- ఆదుకోవాలంటూ వేడుకోలు
- గ్రీవెన్స్‌లో 16సార్లు దరఖాస్తు
- భరోసా ఇవ్వని అధికార యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అశ్వాపురం మండలానికి చెందిన టీపీ విజయ 1986లో జగ్గారం క్రాస్‌రోడ్డులో 6.50 సెంట్ల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసింది. ఆమెతో పాటు ఎంతో మంది ఇక్కడ ఇంటి స్థలాలు కొనుగోలు చేశారు. స్థానికంగా ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఈ క్రయవిక్రయం అంతా బాండ్ పేపర్ల మీదనే జరిగింది. ఆ తర్వాత కాలంలో స్థలం కొనుగోలు చేసిన అనేక మంది ఇళ్లు నిర్మించుకున్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా విజయ ఇంటి నిర్మాణం చేపట్టలేకపోయింది. 2020 వరకు ఇంటి స్థలానికి ఎటువంటి ముప్పు రాలేదు. కానీ ఆ తర్వాతే స్థలం తమదంటూ కొందరు వ్యక్తులు ముందుకొచ్చారు. అప్పటి నుంచి వివాదం నడుస్తోంది. ఒక్కో విచారణ పూర్తయ్యే కొద్దీ స్థలాన్ని కొద్దికొద్దిగా కోల్పోవడం మొదలైంది. చివరకు పెళ్లీడుకు వచ్చిన ఇద్దరు పిల్లలతో కుటుంబం రోడ్డు మీదకు రావాల్సిన దుస్థితి నెలకొంది. స్థానికంగా అమల్లో ఉన్న చట్టాలకు క్షేత్రస్థాయిలో అధికారులు ఇష్టారీతిగా వక్ర భాష్యాలు చెబుతూ, కొందరికి చుట్టాలుగా మార్చేయడమే ఇందుకు కారణమనే ఆరోపణలు ఉన్నాయి.

రక్షణ లేక..

టీపీ విజయ భర్త 15 ఏళ్ల క్రితమే మృతి చెందాడు. కూలీ పని చేసుకుంటూ ఇద్దరు కూతుళ్లను పెంచి పెద్ద చేసింది. వాళ్ల పెళ్లికి అవసరం వస్తుందనుకున్న ఇంటి స్థలం ఇప్పుడు వివాదంలో చిక్కుకుంది. దీంతో ఆమె కుటుంబం మొత్తం పనులు మానేసి ఇంటి స్థలానికి రక్షణగా అక్కడే చిన్న రేకుల షెడ్డులో నివసిస్తున్నారు. వీరిని భయభ్రాంతులకు గురిచేసేందుకు రాత్రి వేళ ఆ షెడ్డువైపునకు ఆకతాయిలను ఉసిగొల్పుతున్నారు. కొన్ని సందర్భాల్లో మతిస్థిమితం లేని వ్యక్తులు, అపరిచితులు ఇంట్లోకి దూరి తమను ఇబ్బంది పెడుతున్నారని విజయ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఏ ఆధారం, ఎలాంటి అండదండలు లేని తమకు కలెక్టర్ కార్యాలయం నుంచే న్యాయం జరగాలని వేడుకుంటోంది.

ఆవుదూడకు జన్మదిన వేడుకలు !

చండ్రుగొండ : పిల్లలు, పెద్దలు జన్మదిన వేడుకలు జరుపుకోవడం సహజం. కానీ ఓ రైతు.. తన ఇంట్లో పురుడుపోసుకున్న ఆవుదూడకు సోమవారం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాడు. చండ్రుగొండ మండల కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన పెంపుల సీతారాములు ఇంట్లో గతేడాది మార్చి 13న ఓ ఆవు దూడకు జన్మనిచ్చింది. అయితే ఆ దూడ పుట్టినప్పటి నుంచి తనకు వ్యవసాయంలో బాగా కలిసొచ్చిందని ఆనందించిన రైతు.. సోమవారం రాత్రి కాలనీ వాసులందరినీ పిలిచి ఆవు దూడ మొదటి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించాడు.



ఆవుదూడ, కేక్‌తో రైతు సీతారాములు

'ప్రజావాణి' సమస్యలు పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఐడీఓసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని, వచ్చే వారం నాటికి అన్నీ పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం కాకుంటే అదే విషయాన్ని దరఖాస్తుదారుడికి తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని..

- సుజాతనగర్‌కు చెందిన అలిపక పుల్లమ్మ మండల పరిధిలోని సర్వే నం.4/అ/1 లోఉన్న 0.12 గుంటల భూమికి పట్టాదాను పాసుపుస్తకం ఇప్పించాలని దరఖాస్తు చేయగా కొత్తగూడెం ఆర్డీఓకు ఎండార్స్ చేశారు.
- దుమ్ముగూడెం మండలం పేరాయిగూడెం గ్రామానికి చెందిన వాగి ముత్తమ్మ సర్వే నం.29/1లో తనకు వ్యవసాయ భూమి ఉందని, ఆ భూమి సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో పోతున్నందున పరిహారం ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చింది. పరిశీలించిన కలెక్టర్ విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని దుమ్ముగూడెం తహశీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- కొత్తగూడెం రామవరానికి చెందిన లాలాజి శ్రీనివాస్ జీఓ 76 ప్రకారం ఇంటిస్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నానని, తనకు పట్టా మంజూరు చేయలేదని అన్నారు. దీనిపై విచారణ నిర్వహించి పట్టా మంజూరు చేయాలని తహశీల్దార్‌కు ఎండార్స్ చేశారు.

18న దిశ సమావేశం

ఈనెల 18న దిశ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగిన నివేదికలు అందజేయాలని సూచించారు. శ్రీరామనవమి వేడుకల నిర్వహణలో విధులు కేటాయించిన అధికారులు పనులను పర్యవేక్షించాలని, ఈ వారంలో భద్రాచలంలో సమీక్ష సమావేశం ఉంటుందని తెలిపారు. 5 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల మంజూరుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు.

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సీఈఓ విద్యాలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, శాశ్వత ఆహ్వానితులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

- పంచాయతీ సిబ్బందికి డీపీఓ ఆదేశం
- అమెర్ద గ్రామాన్ని సందర్శించిన రమాకాంత్, వైద్యాధికారులు



తహసీల్దార్, ఎంపీడీఓతో మాట్లాడుతున్న డీపీఓ రమాకాంత్

అశ్వాపురం: మండలంలోని అమెర్దలో ఇద్దరు వ్యక్తులు డెంగీతో మరణించడంతో సోమవారం జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్ ఆ గ్రామాన్ని సందర్శించారు. ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ ఎం.ఏ.రాజు, ఎంపీఓ శ్రీనివాస్, సర్పంచ్ సీతమ్మతో కలిసి వీధుల్లో పారిశుద్ధ్య చర్యలను పరిశీలించారు. వీధులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని, అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు.

ఎవరూ ఆందోళన చెందొద్దు..

జ్వరాలపై ఎవరూ భయాందోళన చెందవద్దని వైద్యాధికారి సంకీర్తన అన్నారు. అమెర్ద కాలనీ గ్రామంలో సోమవారం ఇంటింటి సర్వే, వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా మలేరియా సహాయ అధికారి గొంది వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంకీర్తన మాట్లాడుతూ.. గ్రామంలో మృతి చెందిన బర్ల ప్రవీణ్ బ్లడ్ ఇన్‌ఫెక్షన్, కామెర్లతో, నక్కా శ్రావణి కడుపులో గడ్డలు పగిలి ఇన్‌ఫెక్షన్‌తో మృతి చెందారని, డెంగీతో కాదని చెప్పారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. గ్రామంలో వారం రోజుల పాటు వైద్య శిబిరం కొనసాగుతుందని, అందరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా కో ఆర్డినేటర్ కృష్ణయ్య, సీహెచ్‌ఓ కాంతమ్మ, హెచ్‌వీలు ఝాన్సీ, రాజమ్మ, హెచ్‌ఏలు రాజేష్, కిరణ్, సబ్ యూనిట్ అధికారి లింగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం

- రేపటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు
- అమలులో నిమిషం నిబంధన..
- జిల్లాలో 35 కేంద్రాలు ఏర్పాటు
- హాజరు కానున్న 19,867 మంది విద్యార్థులు



ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న కళాశాల సిబ్బంది (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి. ఇందుకోసం జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాలు ఏర్పాటు చేయగా, మంగళవారం ఆయా సెంటర్లలో హాల్ టికెట్ నంబర్లు వేయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, నిమిషం నిబంధన అమలులో ఉన్నందున విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు సూచిస్తున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే కలెక్టర్ అనుదీప్ పోలీస్, వైద్య, మున్సిపల్, పంచాయతీ, విద్యుత్ శాఖల అధికారులతో పాటు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాళ్లతో సమావేశం ఏర్పాటు చేశారు. కాగా, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి సులోచనారాణి తెలిపారు.

16 జోన్లు.. 35 కేంద్రాలు..

జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు 35 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని 16 జోన్లుగా విభజించి పర్యవేక్షణ చేయనున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 10,363 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 9,504 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్ల గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని 16 పోలీస్‌స్టేషన్లలో ప్రశ్నపత్రాలను భద్రపర్చనున్నారు. పరీక్షల నిర్వహణకు 35 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 35 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, మూడు సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఐదు కస్టోడియన్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 520 మంది ఇన్విజిలేటర్లకు విధులు కేటాయించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తారు. అన్ని కేంద్రాల్లో అత్యవసర వైద్య శిబిరాలు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం సీహెచ్‌సీల్లో వార్డులను సిద్ధం చేస్తున్నారు. పంచాయతీ, మున్సిపల్ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు. సురక్షిత తాగునీటి సరఫరాకు మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఇప్పటికే విద్యుత్ అధికారులకు సూచించారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి వీలుగా అదనపు బస్సుల ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు సిద్ధమవుతున్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించేది లేదని, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు సూచించారు.

ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి : కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇంటర్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఐడీఓసీ నుంచి వివిధ శాఖల జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15 నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 19,867 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని, నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. పరీక్షలంటే భయం, ఆందోళన చెందే విద్యార్థుల కోసం రాష్ట్రస్థాయిలో 24 గంటలూ పనిచేసేలా 14416 టెలీమానస్ టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారని, కాల్ చేస్తే మానసిక వైద్య నిపుణులు ఉచితంగా కౌన్సిలింగ్ ఇస్తారని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు సలహాలు, సూచనల కోసం 040-24601010, 040-24655027 నంబర్లు ఏర్పాటు చేశారని, ఏదైనా సహాయం అవసరమైతే విద్యార్థులు ఫోన్ చేయవచ్చని తెలిపారు. హాల్ టికెట్ల జారీలో విద్యార్థులను ఇబ్బంది పెడితే కళాశాలల యాజమాన్యాలపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. https://tsbie.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలో విద్యార్థుల సందేహాలు, సలహాల కోసం 7997994366, 891996013, 9441817478 నంబర్లకు కాల్ చేయాలని అన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు, డీఐఈఓ సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

నిమిషం నిబంధన అమల్లో ఉంది



ఈనెల 15 నుంచి జరుగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షల్లో నిమిషం నిబంధన అమలులో ఉంటుంది. పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతున్నందున అంతకుముందే విద్యార్థులు కేంద్రాల వద్దకు చేరుకోవాలి. నిమిషం ఆలస్యంగా వచ్చినా ఆయా కేంద్రాల నిర్వాహకులు వెనక్కు పంపిస్తారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. – సులోచనారాణి, డీఐఈఓ

క్లుప్తంగా

గడల శ్రీనివాసరావును డీహెచ్‌గా తొలగించాలి



మాట్లాడుతున్న యెర్రా కామేష్

సుజాతనగర్: అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న గడల శ్రీనివాసరావును హెల్త్ డైరెక్టర్ పదవి నుంచి తొలగించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. మండలంలోని రాఘవాపురంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీహెచ్ హోదాలో ఉండి ముఖ్యమంత్రి ఆదేశిస్తే పోటీచేస్తా అని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గడల శ్రీనివాసరావును పదవి నుంచి తొలగించాలని కోరారు. అలాగే, శ్రీనివాసరావు అక్రమాలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు గుండేటి ఆదినారాయణ, నాయకులు కత్తి బాలకృష్ణ, నాగరాజు, తుడుం మహేష్, తాళ్లూరి రాము, మురిపిటి చారిబాబు, మణికంఠ పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మంలీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమంలో చెల్లని చెక్కు ఇవ్వడంతో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువడింది. ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి పి.మౌనిక సోమవారం వెల్లడించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురానికి చెందిన ఇంటూరి సుధ వద్ద ఇల్లెందుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి వెంకటేశ్వర్లు 2018, సెప్టెంబర్ 23న రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఆ తర్వాత 2019 జనవరి 28న ఆయన ఇచ్చిన చెక్కును బ్యాంకులో జమ చేయగా నగదు లేక పోవడంతో బౌన్స్ అయింది. దీంతో సుధ తన న్యాయవాది ద్వారా కోర్టులో దాఖలు చేసిన ప్రైవేట్ కేసును న్యాయమూర్తి విచారించి వెంకటేశ్వర్లుకు ఆరు నెలల జైలు శిక్ష విధించడంతో పాటు రూ.లక్ష చెల్లించాలని తీర్పు చెప్పారు.

రోడ్డుప్రమాదంలో గాయాలు

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో పాపకొల్లు క్రాస్ రోడ్ వద్ద సోమవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... ఈ నెల 16న ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో జూలూరుపాడుకు చెందిన నితీష్ అనే విద్యార్థి తన మిత్రులతో కలిసి కళాశాలలో హాల్‌టికెట్లు తీసుకుని బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో పాపకొల్లు క్రాస్ రోడ్ వద్ద రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో ఖమ్మం నుంచి పాల్వంచ వైపు మరో బైక్‌పై వెళ్తున్న పాల్వంచకు చెందిన ఎస్కే షఫీ అనే వ్యక్తి ఢీకొట్టాడు. ఈ ఘటనలో నితీష్, షఫీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను దగ్గరలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం నితీష్‌ను కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరో మూడు రోజుల్లో పరీక్షలకు హాజరుకావాల్సిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధ్యాయుడికి..

పాల్వంచరూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు గాయపడ్డ సంఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మధిర మండలం జాలిమడి గ్రామానికి చెందిన పత్తిపాటి వీరయ్య ములకలపల్లి మండలం రాజీవ్‌నగర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 10న ఆయన ద్విచక్రవాహనంపై పాల్వంచకు వస్తుండగా రంగాపురం వద్ద బీసీఎం జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరయ్య భార్య ప్రణీత సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.


గోదావరిలో దూకి ఒకరికి..

భద్రాచలంటౌన్: భార్యతో గొడవపడి ఓ వ్యక్తి భద్రాచలం వద్ద గోదావరి వంతెనపై నుంచి దూకి తీవ్ర గాయాల పాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం కొర్రాజుల గుట్ట కాలనీకి చెందిన రాము తన భార్యతో తరచు గొడవపడుతున్నారు. సోమవారం కూడా గొడవ జరగ్గా, మనస్తాపం చెంది వంతెనపై నుంచి గోదావరిలో దూకాడు. రాము పడిన చోట ఇసుక ఉండటంతో తీవ్ర గాయాలై ప్రాణాలతో బయటపడ్డాడు. జాలర్లు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లి క్షతగాత్రుడిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థిని గాయపర్చిన ఉపాధ్యాయుడు

ఇల్లెందురూరల్: ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఉపాధ్యాయుడు కొట్టడంతో చేతి వేలు విరిగింది. ఇల్లెందులోని ఓ స్కూల్ తరగతి గదిలో సోమవారం వెనకాల కూర్చున్న స్నేహితుడితో మాట్లాడుతున్నాడంటూ పుష్పక్‌ను ఉపాధ్యాయుడు పరీక్ష ప్యాడ్‌తో కొట్టాడు. దీంతో ఆయన చేయి వేలు విరిగింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

డయల్ 100.. వెరీ స్లో!

- సాంకేతిక లోపంతో పనిచేయని ట్యాబ్‌లు
- ఫలితంగా ఆలస్యంగా వెళ్తున్న పోలీసులు
- బాధితుల అసహనం.. ఉన్నతాధికారుల ఆగ్రహం

పాల్వంచ: 'అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేస్తే తక్షణమే పోలీస్ సిబ్బంది అప్రమత్తమవుతారు. బాధితుడు ఉన్న ప్రాంతానికి చేరుకుని తగిన రక్షణ, సహాయం అందిస్తారు.' అని ఫోన్ చేస్తే గంట వరకు రావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కాల్ చేసిన గంటకు కూడా పోలీసులు అందుబాటులోకి రావడం లేదని, వారు వచ్చేసరికి పరిస్థితి చేయి దాటిపోవడమో, లేక ఎక్కడి దొంగలు అక్కడే గప్ చుప్ అన్నట్లు సీన్ మారిపోతోందని పేర్కొంటున్నారు. కాగా కొన్ని సంవత్సరాల క్రితం స్టేషన్ సిబ్బందికి ఇచ్చిన ట్యాబ్‌లు సాంకేతిక కారణాల వల్ల సక్రమంగా పనిచేయడం లేదని సిబ్బంది పేర్కొంటున్నారు. దీనికితోడు నిత్యం హైవేలపై జరిగే కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు తిరగాల్సిన పెట్రో కార్లు సైతం అరకొరగానే వినియోగిస్తున్నారు. మెయింటెనెన్స్ భారం కావడంతో స్టేషన్లలోనే ఉంచుతున్నారు.

మీటింగ్‌లతోనే సరి..

ప్రతి నెలా రెండు లేదా మూడు సార్లు 100 నంబర్‌కు వచ్చిన ఫోన్ కాల్స్‌పై ఉన్నతాధికారులు సమీక్ష చేస్తున్నారు. కానీ వాటి నిర్వహణపై సరైన దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పనిచేయని ట్యాబ్‌లను ఐటీ కోడ్ సిబ్బంది వచ్చి మార్చక పోవడంతో సమాచారం వృథా అవుతోంది. సెట్‌లో వచ్చినప్పుడు మాత్రం విన్న వారు స్పందిస్తున్నారు. 100 కాల్ చేసిన తర్వాత గంటకు వెళితే ఫోన్ చేసిన వారు సైతం పోలీసు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు సకాలంలో ఎందుకు వెళ్లడం లేదని ఉన్నతాధికారులు సైతం కన్నెర్ర చేస్తుండడంతో మధ్యలో కానిస్టేబుళ్లు నలిగిపోతున్నారు.


కాల్ చేసిన గంట తర్వాత సిబ్బందికి సమాచారం?



అరకొరగా పెట్రోకార్ల వాడకం

జిల్లాలో అక్కడక్కడ ఇన్నోవా పెట్రో కార్ల వినియోగం చాలా వరకు తగ్గింది. కార్లలో ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ఉండాల్సి ఉంటుంది. కార్ మెయింటెనెన్స్ స్టేషన్లకు భారంగా మారడంతో రోజుకు గంట, అరగంట మాత్రమే హైవేపై తిప్పి తిరిగి స్టేషన్‌కు తీసుకొచ్చి పెట్టేస్తున్నారు. సర్కిల్ పరిధిలో మూడు, నాలుగు స్టేషన్‌లు ఉండగా ఆ పరిధి మొత్తం కవర్ చేయడం లేదు. ఎస్‌ఐలకు ప్రభుత్వం కేటాయించిన నంబర్లకు వచ్చే ఫోన్లను చాలా వరకు ఎత్తడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఫోన్ చేసినా కూడా ఏదో పని బిజీలో ఉన్నామని, వాటిని ఎత్తడం చాలా వరకు తగ్గించారు. ఫోన్‌లు ఎత్తని కారణం వల్ల చాలా ఫిర్యాదులు, ఇతర విలువైన సమాచారం సైతం కోల్పోతున్నారు. వారం రోజుల క్రితం ఎస్పీ నుంచి ఎస్‌ఐల వరకు కొత్త ఫోన్ నంబర్లు ఇచ్చారు. ఈ నంబర్లు ఇంకా ప్రజల్లోకి వెళ్లలేదు. పాత నంబర్లకు కాల్ చేస్తే స్విచ్చాఫ్ వస్తోంది. ఇక 100కి చేస్తే స్పందన కరువు అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బందికి ఆలస్యంగా సమాచారం..



అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు, ప్రమాదాలు, అక్రమ రవాణా వంటి ఘటనలు జరిగితే సమాచారం ఇచ్చేందుకు పోలీస్ శాఖ డయల్ 100ను అందుబాటులోకి తెచ్చింది. ఫోన్‌లో ఫిర్యాదు చేయగానే హైదరాబాద్ కంట్రోల్ బోర్డ్ నుంచి సంబంధిత స్టేషన్ ఎస్‌ఐ, పెట్రోలింగ్ బ్లూకోల్ట్స్ సిబ్బందికి, పెట్రో కార్‌కు సమాచారం వెళుతుంది. వెంటనే వారు ఫోన్ వచ్చిన ప్రదేశానికి వెళ్లి సమస్యపై తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సంఘటనకు సంబంధించిన సమాచారం తిరిగి ఉన్నతాధికారులకు ఇవ్వాలి. కానీ కొన్ని రోజులుగా 100కి ఫోన్ చేసినా సకాలంలో పోలీసులు స్పందించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఫోన్ చేసిన గంట తర్వాత ట్యాబ్‌లకు సమాచారం అందుతుండగా అప్పుడు పోలీసులు వస్తున్నారు. దీంతో అప్పటికే జరగాల్సిన నష్టం జరుగుతోంది.

సమస్యను పరిశీలిస్తాం



డయల్ 100కి వస్తున్న ఫోన్‌లకు సంబంధించిన ట్యాబ్‌ల సమస్యను వెంటనే పరిశీలిస్తాం. వాటిని అందుబాటులో ఉండేలా చేస్తాం. తమ కళ్లెదుట జరిగే అసాంఘిక కార్యకలాపాలు, ఇతర సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తేనే సమస్యలకు చెక్ పడుతుంది. పెట్రో కార్‌లు కూడా పర్యవేక్షణ చేస్తున్నాయి. మరింత పటిష్టం చేస్తాం.

–వెంకటేశ్, డీఎస్పీ, పాల్వంచ

ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం



అమెర్దలో గోదావరి రేవు వద్ద కందకాలు తవ్విస్తున్న తహసీల్దార్ రాజు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: గోదావరి రేవుల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.ఏ.రాజు పేర్కొన్నారు. గోదావరి నుంచి ఇసు'కాసులు' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మండల పరిధిలోని అమ్మగారిపల్లి, అమెర్ద, చింతిర్యాలలో గోదావరి నుంచి ఇసుక అక్రమ రవాణా చేయకుండా రేవుల వద్ద ఆర్‌ఐ రాజేశ్వరరావు, రెవెన్యూ సిబ్బందితో కలిసి జేసీబీలతో కందకాలు తవ్వించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ 'సాక్షి'తో మాట్లాడుతూ మండలంలో గోదావరి రేవుల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మెరుగైన సేవలే పరిష్కార వేదిక లక్ష్యం

సాంకేతిక సభ్యుడు తిరుమల్‌రావు



మాట్లాడుతున్న వేదిక సాంకేతిక సభ్యుడు తిరుమల్‌రావు

ఇల్లెందురూరల్: విద్యుత్ పంపిణీ వ్యవస్థలో వినియోగదారులకు ఎదురయ్యే సేవా లోపాలను సత్వరం పరిష్కరించడమే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక లక్ష్యమని సాంకేతిక సభ్యుడు తిరుమలరావు పేర్కొన్నారు. ట్రాన్స్‌కో ఇల్లెందు సబ్‌డివిజన్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు సంస్థ అందించే ప్రతి సేవకు నిర్ణీత కాలపరిమితిని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి నియమావళిలో పొందుపర్చారని చెప్పారు. ఆ నియమాలను అమలు చేయాల్సిన బాధ్యత క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే అధికారులపై ఉంటుందని అన్నారు. సంస్థ సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సమస్య వేదిక దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వేదిక మెంబర్ ఫైనాన్స్ చరందాస్, ఇండిపెండెంట్ మెంబర్ నరేందర్, ఎస్సీఓ మురళి, డీఈ శేషాద్రి, ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

జూలూరుపాడు: పబ్లిక్ పరీక్షలను ఆత్మవిశ్వాసంతో రాయాలని జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజ శేఖర్ పదో తరగతికి విద్యార్థులకు సూచించారు. సోమవారం ఆయన పాపకొల్లు హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం బచ్చలకోయగూడెం, గుండ్లరేవు ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి అసంతృప్తి వ్యక్తం చేశారు. గుండ్లరేవు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ఊరు–మన బడి పనుల పురోగతిని పరిశీలించి, పనులు వేగవంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

హరితహారం మొక్కలు దగ్ధం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి పంచాయతీలో అశ్వారావుపేట–భద్రాచలం ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న హరితహారం మొక్కలు సోమవారం పెద్ద సంఖ్యలో మంటల్లో కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి రహదారి పక్కనే ఉన్న అడవితోపాటు, సుమారు వందకుపైగా హరితహారం మొక్కలు దగ్ధమయ్యాయి. సర్పంచ్ సాధు జోత్స్నబాయి సమాచారంతో అగ్నిమాపక సిబ్బందివచ్చి మంటలను అదుపు చేశారు.

జీడి మామిడి తోటలో అగ్ని ప్రమాదం



దగ్ధమైన జీడి మామిడి తోట

మండల పరిధిలోని కన్నాయిగూడెం పంచాయతీ గొప్పగూడెం సమీపంలో జీడి మామిడి, జామాయిల్ తోటల్లో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానిక రైతు గొంది మారప్పకు చెందిన రెండు ఎకరాల జీడి మామిడి తోటలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. రెండెకరాల్లోని జీడి మామిడి చెట్లు పూర్తిగా కాలిపోగా సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోతున్నాడు. జీడి మామిడితోటకు ఆనుకుని ఉన్న మరో ఇద్దరు రైతులకు చెందిన 18 ఎకరాల జామాయిల్ తోటల్లోకి మంటలు వ్యాపించగా, పాక్షికంగా చెట్లు కాలిపోయాయి. గమనించిన గ్రామస్తులు మంటలను ఆర్పేశారు.

16 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంటౌన్: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ కథనం ప్రకారం... పట్టణ ఎస్సై మధు ప్రసాద్ సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న క్రమంలో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 16 కిలోల గంజాయి లభించింది. విచారించగా తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన జీవనందన్, మనికందన్, శంకర్‌గా తేలింది. పోలీసులు విచారిస్తున్న సమయంలో శంకర్ తప్పించుకుని పరారయ్యాడు. మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని, పట్టుబడ్డ గంజాయి విలువ రూ.3.20 లక్షలు ఉంటుందని ఏఎస్పీ తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ నాగరాజు రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దాచిన గంజాయి కోసం వచ్చి..

మరొకరితో కలిసి పోలీసులకు పట్టుబడ్డ నిందితుడు

గుండాల: ఇటీవల పోలీసులు తనిఖీ చేస్తున్న క్రమంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తి కారు దిగి పారిపోయాడు. ఈ క్రమంలో దాచిపెట్టిన గంజాయి కోసం మరో వ్యక్తితో కలిసి వచ్చి ఆదివారం రాత్రి పోలీసులకు పట్టుబడ్డాడు. టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఆళ్లపల్లి ఎస్సై కథనం ప్రకారం.. ఆళ్లపల్లి మండలంలోని తీగలంచ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన నూనావత్ నరేందర్, రామావత్ రామును అదుపులోకి తీసుకున్నారు. విచారించి నుంచి రూ. 80 వేల విలువైన 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా నూనావత్ నరేందర్ ఇటీవల ఆళ్లపల్లి మీదుగా అక్రమంగా కారులో గంజాయి తరలిస్తూ, పోలీసులను గమనించి పారిపోయాడు. మరో వ్యక్తి భరత్‌ను అరెస్ట్ చేసి, కోర్టులో రిమాండ్ చేశారు. నరేందర్ పారిపోతున్న క్రమంలో కొంత గంజాయిని వెళ్లేదారిలో దాచిపెట్టాడు. దాని కోసం మరో వ్యక్తి రాముతో కలిసి రాగా, పోలీసులు అరెస్ట్ చేశారు. రాము గంజాయితో వస్తున్న కారుకు పైలెట్‌గా ముందు మరో కారులో వెళ్తుంటాడని విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

చర్ల: మండలం కేంద్రంలోని పశువైద్యశాల సమీపంలో ఆదివారం రాత్రి ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కందిపాడుకు చెందిన మడివి దేవా, మడివి చోటూ(23) ద్విచక్రవాహనంపై ఆదివారం రాత్రి చర్ల బస్టాండ్ సెంటర్ నుంచి గాంధీ సెంటర్‌కు వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చర్ల ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అర్ధరాత్రి వరంగల్‌లోని ఎంజీఎంకు తరలి స్తుండగా మడవి చోటు మార్గంమధ్యలో మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా దేవాను ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఎడ్ల బండిని ఢీకొట్టిన లారీ

మణుగూరుటౌన్: మణుగూరు–ఏటూరునాగారం ప్రధాన రహదారిలో సోమవారం ఉదయం ఎడ్ల బండిని బొగ్గు లారీ ఢీకొట్టింది. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కోటకట్ట ప్రాంతానికి చెందిన రైతు బిజిగి సతీష్ తన ఎడ్లబండితో వెళ్తున్న క్రమంలో బొగ్గు లారీ ఢీకొట్టింది. ఎద్దులకు తీవ్ర గాయాలు కావడంతో ఒకటి అక్కడే మృతి చెందింది. ఎడ్ల బండి ధ్వంసమైంది. మణుగూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

అనర్హతపై కోర్టును ఆశ్రయించిన ఉపసర్పంచ్

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌గా, వార్డు సభ్యురాలిగా ఉన్న యాకూబీపై అనర్హత వేటు వేస్తూ కలెక్టర్ అనుదీప్ గత నెల 14న ఉత్తర్వులు జారీ చేశారు. తన నుంచి వివరణ కోరకుండా కలెక్టర్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపిస్తూ అనర్హతకు గురైన ఉపసర్పంచ్ ఇటీవల హైకోర్టును ఆశ్రయించింది. దీంతో కలెక్టర్‌ను వివరణ కోరుతూ, కలెక్టర్ ఇచ్చే వివరణపై తదుపరి నిర్ణయం వెలువరించే వరకు యాకూబీని వార్డుసభ్యురాలిగా, ఉపసర్పంచ్ హోదాలోనే కొనసాగించాలని న్యాయస్థానం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆ ఉత్తర్వుల ప్రతులను కలెక్టర్ అనుదీప్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్‌కు అందజేసి, తనను ఉపసర్పంచ్‌గా కొనసాగించాలని కోరినట్లు యాకూబీ సోమవారం తెలిపింది.

శుభకార్యానికి వెళ్లొస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం.. ఖమ్మానికి తరలింపు



క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: పెళ్లికి వెళ్లొస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డ ఘటన ఇల్లెందు శివారు జేకే బైపాస్ రోడ్డులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. కారేపల్లి మండలం పంతులునాయక్‌తండా గ్రామానికి చెందిన పలువురు పొలెంపల్లి గ్రామంలో వివాహ వేడుకకు హాజరై రాత్రి వేళ ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామానికి చెందిన సురేష్ బైక్‌పై ఇల్లెందు పట్టణం నుంచి బైపాస్ ద్వారా స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఎనిమిది మంది గాయపడ్డారు. అదే సమయంలో మహబూబాబాద్ నుంచి బైపాస్ మీదుగా ఇల్లెందుకు వస్తున్న కాంగ్రెస్ నేత డాక్టర్ రాంచంద్రనాయక్ తన వాహనంలో కొందరిని ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. మిగిలిన వారిని 108 ద్వారా తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులలో శ్రీను, లక్ష్మి, సురేష్, సక్రు, బుజ్జి తీవ్రంగా గాయపడగా, అమ్ములు, శారద, మంగీలాల్ స్వల్పంగా గాయపడ్డారు. శ్రీను, లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. ప్రభుత్వాస్పత్రి వైద్యులతోపాటు డాక్టర్ రాంచంద్రనాయక్ కూడా సేవలందించారు.

చందాదారుల సొమ్ముతో దందా!

▶ మొదటి పేజీ తరువాయి

చెల్లిస్తున్న సొమ్ముకు ఎలాంటి భద్రతా లేదు' అని పేర్కొన్నారు. సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో వారు సంయుక్తంగా విలేకరులతో మాట్లాడుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐడీ అదనపు డీజీ సంజయ్. చిత్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ

■ చిట్‌ఫండ్ చట్టం సామాజిక, ఆర్థికపరమైన చట్టమని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. చందాదారుల హక్కుల పరిరక్షణ, చిట్‌ఫండ్ కంపెనీల్లో ఆర్థిక క్రమశిక్షణ కోసమే ఈ చట్టం చేశారని పేర్కొంది. చిట్‌ఫండ్స్ చట్టం–1982 ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీ బ్రాంచిలోని మేనేజర్ (ఫోర్‌మేన్) చందాదారులు చెల్లించే సొమ్ముకు పరిరక్షకుడు. చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పర్యవేక్షకుడు. ■ బ్యాంక్ లావాదేవీల నిర్వహణ, నిధుల చెల్లింపులన్నీ ఫోర్‌మేన్ నిర్వహించాలి. రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉన్న 37 బ్రాంచీల్లో ఏడు బ్రాంచిలో తనిఖీలు చేశాం. చందాదారులు చెల్లించిన మొత్తం అక్కడి బ్యాంకుల్లో లేదన్న విషయం అందులో వెల్లడైంది. ఆ సొమ్మంతా నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించేశారు. ■ మార్గదర్శి ఫోర్‌మేన్‌కు చట్ట ప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తోసహా ఎలాంటి అధికారాలు లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజతోపాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. ■ ఇక్కడున్న చందాదారుల సొమ్ముల భద్రత గురించి అడిగితే తనకు తెలియదని ఫోర్‌మెన్ చెబుతున్నారు. హైదరాబాద్ వెళ్లి అడిగితే తెలంగాణలో ఉన్న ప్రధాన కార్యాలయం ఏపీ అధికారుల పరిధిలోది కాదంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చందాదారులు చెల్లిస్తున్న డబ్బులకు బాధ్యులెవరని ప్రశ్నిస్తే సమాధానమే లేదు. సొమ్ము రాష్ట్ర ప్రజలది...పెత్తనం పక్క రాష్ట్రంలో వారిది. ■ మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులకు చెందిన సొమ్ములను నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్, తమ అనుబంధ కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టారు. ఆ సంస్థ బ్యాలన్స్ షీట్, కొన్ని బ్యాంకు ఖాతాలను చార్టెడ్ అకౌంటెంట్ ద్వారా పరిశీలిస్తే ఈ విషయాలు బయటపడ్డాయి. అందుబాటులో ఉన్న కొన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్స్‌లో మూడుసార్లు రూ.29 కోట్లు, రూ.10 కోట్లు, రూ.8 కోట్లు చొప్పున, ఎడెల్‌వైసీస్ ఆర్బిట్రేడ్ ఫండ్స్‌లో రూ.10 కోట్లు చొప్పున నిబంధనలకు విరుద్ధంగా పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడైంది. పూర్తి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే ఇంకా ఎన్ని పెట్టుబడులు పెట్టారో తెలుస్తుంది. ■ విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరులో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఫోర్‌మెన్‌లను అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాం. గుంటూరు మినహా మిగతా మూడు చోట్లా న్యాయస్థానాలు నిందితులకు రిమాండ్ విధించాయి. నిందితులపై సీఐడీ మోపిన అభియోగాలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలున్నాయని రిమాండ్‌కు అనుమతిస్తూ న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. సీఐడీ కేసు డైరీలో పేర్కొన్న అంశాలతో తాము సంతృప్తి చెందినట్లు, వారిని అరెస్టు చేయడం సరైనదేనని పేర్కొన్నాయి.■ మార్గదర్శి యాజమాన్యం నిధుల ను అక్రమంగా బదిలీ చేస్తూ, చిట్స్ రిజిస్ట్రార్‌కు సహాయ నిరాకరణ కొనసాగిస్తే చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారన్న అంశంతో మాకు నిమిత్తం లేదు. ఏపీ ప్రయోజనాలు, చందాదారుల సొమ్ముకు భద్రత కల్పించడమే మా విధి. ఈ కేసులో విచారణ కొనసాగిస్తాం. కేసు దర్యాప్తులో పురోగతికి అనుగుణంగా ఏ–1 చెరుకూరి రామోజీ రావు, ఏ–2 చెరుకూరి శైలజనూ విచారించడంతోపాటు ఇతర చర్యలను తగిన సమయంలో తీసుకుంటాం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇదో.. పోంజీ తరహా స్కామ్

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌యాజమాన్యం పోంజీ స్కామ్ తరహా అక్రమాలకు పాల్పడుతోంది. చిట్టీలలో 30 శాతం నుంచి 40 శాతం టికెట్లు (సభ్యత్వాలు) యజమాన్యం పేరిట ఉంచుతోంది. ఆ టికెట్లకు చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. ఇతర చందాదారులు చెల్లించిన చందాలను తాము చెల్లించినట్లు రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. చందాదారుల సొమ్మును వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటోంది.

ఇక్కడెందుకీ పిటిషన్?

మార్గదర్శిని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు

- ఏపీలో హైకోర్టు ఉంది కదా..?
- కేసులు, దర్యాప్తు అంతా అక్కడే..
- అలాంటప్పుడు వీటిని విచారించే పరిధి ఈ కోర్టుకు ఉందా?
- దీనిపై తేలకుండా దర్యాప్తులో జోక్యం చేసుకోలేం
- విచారణ ఈ నెల 20వతేదీకి వాయిదా
- నిందితులు ఏ రాష్ట్రంలో ఉన్నా అరెస్టు అధికారం పోలీసులకు ఉంది
- వారిపై నమోదైనవి 10 ఏళ్ల పైగా శిక్ష పడే కేసులే
- ఏపీలో నమోదైన కేసుల్లో ఇక్కడ ఉపశమనం కోరలేరు
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్: 'ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఉంది కదా..? మరి ఇక్కడెందుకీ పిటిషన్ దాఖలు చేశారు..?' అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. కేసులు ఏపీలో నమోదయ్యాయి.. విచారణ అధికారులూ ఏపీ వారే.. బ్రాంచ్‌లు ఉన్నది కూడా అక్కడే.. అలాంటప్పుడు ఈ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు ఉందా? అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీనిపై తేలకుండా దర్యాప్తులో తాము జోక్యం చేసుకోవడం సరికాదని అభిప్రాయపడింది. ఏదేమైనా విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేస్తున్నామని, ఆలోగా పరిధిపై నిర్ణయిస్తామని స్పష్టం చేసింది. మార్గదర్శిపై ఏపీలో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా అరెస్టు సహా బలవంతపు చర్యలు చేపట్టకుండా, హైదరాబాద్‌లోని తమ ప్రధాన కార్యాలయంలో తనిఖీలు నిర్వహించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, చెరుకూరి రామోజీరావు, శైలజ తరఫున లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి, మార్గదర్శి తరఫున న్యాయవాది దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు.

అక్కడి కేసులపై.. ఇక్కడ విచారణా?

'409, 477(ఏ), 420 సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ 10 ఏళ్లకు పైగా శిక్ష పడే కేసులే. కాగ్నిజబుల్ నేరాల కిందికే వస్తాయి. ఏపీలో నమోదైన కేసులపై ఇక్కడ ఉపశమనం కోరలేరు. ఈ కోర్టుకు అక్కడి కేసులపై విచారణ జరిపే పరిధి లేదు. గతంలో పిటిషన్‌పై విచారణ సందర్భంగా తెలంగాణలోని మార్గదర్శి కార్యాలయాల్లో తనిఖీలపై కోర్టు స్టే ఇచ్చింది. అయితే అప్పటికే స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లను, రిజిస్టర్లను పరిశీలించగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో కేసులు నమోదు చేశారు. అక్రమాలు నిగ్గ తేలినప్పటికీ కేసులు నమోదు చేయవద్దని, ఎఫ్ఐఆర్ దాఖలు చేయవద్దని కోర్టు ఉత్తర్వుల్లో ఆదేశించలేదు. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. మొత్తం బ్రాంచ్‌లకు వారే బాధ్యులు. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలోకి అక్రమంగా మళ్లిస్తున్నారు. చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ చందాదారుల హక్కులకు విఘాతం కలిగిస్తున్నారు. ఒకటి రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని విషయాలపై తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. ఇది ఏపీ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. ప్రత్యేకంగా ఏపీకి హైకోర్టు ఏర్పాటైన తర్వాత తెలంగాణ హైకోర్టుకు అక్కడి అంశాలపై పరిధి ఉండదని చట్టం చెబుతోంది. ఒక్క డెట్ రిలీఫ్ ట్రిబ్యునల్(డీఆర్‌టీ)కి సంబంధించి డీఆర్‌టీ–2 రాయలసీమ పరిధి వరకు జోక్యం చేసుకోవచ్చని చట్టం చెబుతోంది. కేసులు నమోదు చేసిన నేరాలన్నీ ఏపీలోనే జరిగాయి. దర్యాప్తు చేస్తున్న పోలీసులూ అక్కడి వారే. అలాంటప్పుడు అరెస్టులు చేయవద్దని ఇక్కడ కోరడం చట్ట విరుద్ధం. అసలు అలా పిటిషనే వేయలేరు. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా పేర్కొంది. ఏపీ హైకోర్టు పరిధిలో కలుగజేసుకోలేమని ఇదే హైకోర్టు పలు తీర్పులను ఇచ్చింది. నిందితులు ఏ రాష్ట్రంలో ఉన్నా అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. అది వారికున్న చట్టబద్ధమైన అధికారం. ఏపీలో హత్య చేసి వచ్చి తెలంగాణలో దాక్కుని అరెస్టు చేయవద్దని ఇక్కడి కోర్టును కోరడం ఎలా చట్టవిరుద్ధమో.. ఇదీ అంతే' అని గోవిందరెడ్డి నివేదించారు. ''పోలీసులు హైదరాబాద్ వస్తున్నారా?'' అని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ప్రాథమికంగా నేరం జరిగింది.. అక్రమాలు జరిగాయని నిరూపణ అయితే అరెస్టు చేయవచ్చని గోవిందరెడ్డి నివేదించారు. ఇదో భారీ వైట్ కాలర్ నేరమన్నారు.

ముందుగా 'పరిధి' తేలుద్దాం..


'ఖాతాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. అయినా తనిఖీలు చేస్తున్నారు. ఎఫ్ఐఆర్‌లో ఏ–1గా రామోజీరావు, ఏ–2గా శైలజ పేర్లు చేర్చారు. మార్గదర్శి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తెలంగాణలో నివసించడం, తెలంగాణలోని బ్రాంచ్‌ల్లోనూ తనిఖీలు చేసే అవకాశం ఉన్నందున ఈ హైకోర్టులో పిటిషన్ వేశాం. ఏపీలో పలు బ్రాంచ్ మేనేజర్లను అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. తనిఖీలపై స్టే విధిస్తూ ఇదే కోర్టు గతంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పుడు తనిఖీలు చేపడితే అది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే అవుతుంది' అని మార్గదర్శి తరఫు న్యాయవాది దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ మిగతా అంశాల జోలికి ఇప్పుడు వెళ్లకుండా అసలు ఈ కోర్టుకు పరిధి ఉందా? లేదా? అన్న విషయాన్ని ముందుగా తేలుద్దామని స్పష్టం చేశారు.

+ తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది రూపేందర్ వాదనలు వినిపించారు. తెలంగాణ డీజీపీని ప్రతివాదిగా చేర్చారని, అసలు ఈ పిటిషన్ విచారణార్హం కాదన్నారు. వచ్చే సోమవారం వరకు పిటిషనర్లపై అరెస్టులు లాంటి చర్యలు తీసుకోబోమని గోవిందరెడ్డి తెలియచేయడంతో న్యాయమూర్తి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు.

అవినాశ్‌పై ఎలాంటి చర్యలొద్దు

అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టొద్దు

- సీబీఐకి తెలంగాణ హైకోర్టు ఆదేశం.. మధ్యంతర ఉత్తర్వులు జారీ
- సునీత పిటిషన్ వెనుక సీబీఐ హస్తం ఉంది
- ఏడాది తర్వాత ఆమె మాట మార్చారు..
- ఆ అభియోగాల వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయి
- వివేకా అల్లుడు, షమీమ్ పాత్రపై సీబీఐ విచారణ చేయడం లేదు
- అన్ని అంశాలపై దర్యాప్తు సాగేలా ఆదేశించండి
- హైకోర్టులో అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు విన్న అనంతరం అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సీబీఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. తాము తీర్పు వెలువరించే వరకు ఈ మధ్యంతర ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. వివేకా హత్య కేసులో సీబీఐ తనను విచారణకు హాజరు కావాలని ఆదేశించడంపై స్టే విధించాలని కోరుతూ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ విచారణ చేపట్టినా ఆడియో, వీడియో రికార్డింగ్‌తోపాటు దర్యాప్తు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగేలా సీబీఐని ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి(పిటిషనర్) తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. తదుపరి విచారణపై స్టే ఇవ్వాలన్న పిటిషన్‌పైనా తీర్పు రిజర్వు చేస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది.

రాజకీయ ఒత్తిళ్లతోనే అభియోగాలు..

'సునీత పిటిషన్ వెనుక సీబీఐ హస్తం ఉంది. కొందరు రాజకీయ నేతల ఒత్తిళ్లతోనే ఆమె పిటిషనర్ (అవినాశ్‌రెడ్డి)పై అభియోగాలు మోపారు. తన తండ్రి పిటిషనర్ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారని, ఇంటింటికి తిరిగారని హత్య జరిగిన అనంతరం కూడా చెప్పిన సునీత ఏడాది తర్వాత మాట మార్చారు. ఆ తర్వాత నుంచి పిటిషనర్‌పై ఆరోపణలు చేయడం ప్రారంభించారు. వివేకా హత్య కేసులో అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, హతుడి రెండో భార్య షమీమ్ పాత్రపై సీబీఐ విచారణ సాగించడం లేదు. వివేకా 2010లో రెండో పెళ్లి చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు జన్మించాడు. రెండో పెళ్లి కారణంగానే వివేకా కుటుంబంలో విభేదాలు వచ్చాయి. ఆర్థిక లావాదేవీల విషయంలో మనస్పర్ధలు తలెత్తాయి. ఈ క్రమంలో తన పేరుతో ఉన్న ఆస్తులను రెండో భార్య పేరుతో రాయాలని వివేకా భావించారు. ఆస్తుల గొడవల వల్లే వివేకా హత్య జరిగింది. ఈ కేసులో రెండో పెళ్లి కూడా కీలక అంశం. సీబీఐ ఆ దిశగా విచారణ చేయాలి. వివేకాది గుండెపోటని పిటిషనర్ ఎక్కడా చెప్పలేదు. స్థానిక రాజకీయ నాయకురాలు శశికళతో పిటిషనర్ అసలు మాట్లాడనే లేదు. ఆమె కూడా ఇదే విషయాన్ని సీబీఐకి చెప్పింది. ఇదే కోర్టులో సీబీఐ దాఖలు చేసిన కౌంటర్ మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. అందులో శశికళ గురించి కూడా ప్రస్తావించారు. ఇప్పటివరకు సీబీఐ రెండు చార్జ్‌షీట్లు దాఖలు చేసినా ఎక్కడా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు నివేదికను కనీసం పరిగణలోకైనా తీసుకోలేదు. నిష్పాక్షిక దర్యాప్తు చేసేలా సీబీఐని ఆదేశించాలి. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో 14న సీబీఐ విచారణకు పిటిషనర్ హాజరుకాకుండా ఆదేశాలు ఇవ్వాలి' అని న్యాయస్థానానికి నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

సీల్డ్ కవర్‌లో వివరాలు...

వివేకా హత్య కేసు డైరీని సీబీఐ సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించింది. 35 మంది సాక్షుల వాంగ్మూలం, 10 డాక్యుమెంట్లు, కొన్ని ఫొటోలు, హార్డ్‌డిస్క్‌లను న్యాయస్థానం ముందు ఉంచింది. వివేకా హత్య జరిగిన ప్రాంతంలో దొరికిన లేఖ, ఎఫ్ఎస్ఎల్ నివేదికను సైతం కోర్టుకు సమర్పించింది. కేసుకు సంబంధించి ఆధారాలను ధ్వంసం చేసినట్లు పిటిషనర్‌పై ఆరోపణలున్నాయని, ఆయనపై తీవ్ర చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయవద్దని న్యాయస్థానాన్ని సీబీఐ కోరింది. సీబీఐ కార్యాలయం ఎదుట మీడియాకు వివరాలను ఎంపీ వెల్లడించడం సరికాదని న్యాయస్థానం పేర్కొంది. ఈనెల 14న (మంగళవారం) విచారణ హాజరు నుంచి మినహాయింపు కోరే అంశంపై సీబీఐనే ఆశ్రయించాలని సూచించింది. ఈ కేసు విచారణ హైదరాబాద్‌కు బదిలీ అయిన తర్వాత పిటిషనర్ తండ్రి భాస్కర్‌రెడ్డిని కడపలో హాజరు కావాలని ఎందుకు పిలిచారని న్యాయమూర్తి సీబీఐని ప్రశ్నించారు. అయితే తాము పిలవలేదని సీబీఐ కోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా తన మీద, తన కుటుంబం పైనా ఆరోపణలు చేశారని అందుకే ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశానని ఈ సందర్భంగా వైఎస్ సునీత కోర్టుకు నివేదించారు.

జిల్లా వార్తలు

ఆలయాల్లో అహోబిల జీయర్ స్వామి పూజలు



అన్నపురెడ్డిపల్లి : భక్తులకు ఉపదేశం చేస్తున్న అహోబిల జీయర్ స్వామి

భద్రాచలం/జూలూరుపాడు/అన్నపురెడ్డిపల్లి: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని త్రిదండి అహోబిల జీయర్‌స్వామి సోమవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలకగా, అంతరాలయంలో మూలమూర్తులు, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఇటీవల దాతలు సమర్పించిన స్వర్ణ వాహనాల వివరాలను వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు వివరించారు. అలాగే, జూలూరుపాడు మండలం కాకర్ల పాలగుట్టపై నిర్మించిన ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్టా మహోత్సవానికి కూడా హోబిల జీయర్ స్వామి హాజరై పూజలు చేశారు. సౌమిత్రి శ్రీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు. ఇంకా అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని కూడా సందర్శించిన జీయర్ స్వామి భక్తులకు ఉపదేశం చేశారు. ఆలయ మేనేజర్ రమణ, అర్చకులు గిరిధరాచార్యులు, ప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమూల మార్పులు

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్





కంటివెలుగు శిబిరంలో వృద్ధుడికి కంటి అద్దాలు అందజేస్తున్న మంత్రి అజయ్‌కుమార్ (ఇన్‌సెట్) విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంఅర్బన్/ఖమ్మం సహకారనగర్: విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున గురుకుల పాఠశాలలు ప్రారంభించి కార్పొరేట్ స్థాయి విద్యను పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజ య్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మం 10వ డివిజన్ ఇందిరానగర్ పాఠశాలతో పాటు సంభానినగర్ పాఠశాలల్లో మన బస్తీ – మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.69లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి సోమవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మన బస్తీ – మన బడి, మన ఊరు – మన బడి ద్వారా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి విడతగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే పనులు చివరి దశలో ఉన్నాయని చెప్పారు. మిగిలిన పనులు వేసవి సెలవుల్లో పూర్తిచేస్తామని వెల్లడించా రు. పాఠశాలల్లో డ్యూయల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు తదితర సౌకర్యాలు అందుబాటులోకి రాగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి వసతులపై ఆరా తీశారు.

ఎవరూ దృష్టి లోపంతో బాధపడొద్దని..

రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా దృష్టి లోపంతో బాధపడొద్దనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం 14వ డివిజన్ గొల్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు వైద్య శిబిరాలకు మంచి స్పందన వస్తోందని, ప్రజలందరూ శిబిరాలకు వచ్చి పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. ఈసందర్భంగా పలువురికి మంత్రి కంటి అద్దాలు అందజేశారు. ఈకార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, కార్పొరేటర్లు చావా మాధురి నారాయణరావు, కూరాకుల వలరాజు, కర్నాటి కృష్ణ, దేశభక్తిని కిషోర్, ఎంఈఓ శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, ఏసుపాదం, కొదుమూరి శ్రీనివాసరావు, జగన్నాథం, స్వర్ణ నాగేశ్వరరావు, పాషా, హెచ్ఎం ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తితో పాటు రక్షణకు ప్రాధాన్యం

సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు



పీకేఓసీలో బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ రావు, అధికారులు

మణుగూరుటౌన్: సింగరేణిలో లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి చేస్తూనే రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డైరెక్టర్(ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు ఆదేశించారు. మణుగూరు ఏరియాలో సోమవారం పర్యటించిన ఆయన తొలుత జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులతో సమావేశమయ్యారు. ఆతర్వాత మణుగూరు ఏరియా పీకేఓసీ గని వ్యూ పాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత, కేసీహెచ్‌పీలో బొగ్గు రవాణాను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యత ఆధారంగా వ్యాపారాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి చేసేలా రోజువారీ పర్యవేక్షించాలని సూచించారు. ఉత్పత్తి చేసిన బొగ్గును నిరాటంకంగా రవాణా చేసేందుకు యంత్రాల పనిగంటలను 14నుంచి 18గంటలకు పెంచాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీఓ లక్ష్మీపతిగౌడ్‌తో పాటు అధికారులు నర్సిరెడ్డి, వీరభద్రుడు, సురేష్, రవీందర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

నేలకొండపల్లి: మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అందరూ సిద్ధం కావాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. నేలకొండపల్లిలో సోమవారం జరిగిన అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బజ్జూరి వెంకట్రామిరెడ్డి అధ్యక్షత వహించగా కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పాలకులు భూపంపిణీ విషయంలో కమిటీలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఆత్మహత్యల్లో రాష్ట్రానికి నాలుగో స్థానం దక్కిందని, ఇకనైనా పాలకులు మేల్కొనాలని సూచించారు. కాగా, దేశంలో పాసిస్టు పాలన సాగుతుండగా, హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రశ్నించే వారిని నిర్బంధించేందుకు తీసుకొస్తున్న చట్టాలను తిప్పికొట్టాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎన్‌డీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు, జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్‌తో పాటు ప్రకాష్, పాలేపొంగు నాగయ్య, ఖాసిం, రామస్వామి, ఐ.వెంకన్న, కోలా లక్ష్మి, నారాయణ, వీరస్వామి, రహీం, మస్తాన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



గిరిజన దర్బార్‌లో బాధితుల సమస్యలు వింటున్న పీఓ గౌతమ్, డీడీ రమాదేవి

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా రాయాలని.. ఈవిషయంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు వారికి అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఆయన గిరిజన దర్బార్‌లో భాగంగా వివిధ ప్రాంతాల గిరిజనుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వాటిని పరిశీలించి యూనిట్ల అధికారులకు అందచేసి అర్హతల ఆధారంగా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందేలా అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఆతర్వాత విద్యావిభాగం అధికారులతో సమావేశమైన పీఓ మాట్లాడుతూ విద్యార్థులందరూ పరీక్షలు ప్రశాంతంగా రాసి మంచి మార్కులు సాధించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈసమావేశంలో ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ రమాదేవితో పాటు అధికారులు సురేష్‌బాబు, శ్రీనివాస్, మునీర్‌పాషా, రమణయ్య, భాస్కర్, ఆదినారాయణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పాఠశాలల్లో ప్రవేశాలకు తుది ఎంపికలు

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్ కిన్నెరసాని(బాలురు), కాచేనపల్లి(బాలికలు)ల్లో ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు తుది ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన భద్రాద్రి జిల్లా విద్యార్థులకు ఈనెల 20న, ఖమ్మం జిల్లా విద్యార్థులకు 21వ తేదీన కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్, రెండు ఫొటోలతో హాజరుకావాలని పీఓ సూచించారు. ఇక మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ఆరో తరగతిలో మూడు సీట్లు, ఏడో తరగతిలో ఒకటి, ఎనిమిదో తరగతిలో నాలుగు, తొమ్మిది తరగతిలో ఖాళీగా ఉన్న ఆరు సీట్లలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు ఎంపిక పోటీలకు హాజరుకావాలని పీఓ తెలిపారు.

శభాష్ మురళి...

50వ సారి రక్తదానం చేసిన ఉద్యోగి



రక్తదానం చేస్తున్న మురళి

భద్రాచలం: ఆపరేషన్లు మొదలు నుంచి సికిల్‌సెల్, తలసేమియా బాధితులకు అవసరమైనప్పుడు రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న భద్రాచలానికి చెందిన కొప్పుల మురళి సోమవారం 50వ సారి రక్తదానం చేశాడు. ములుగు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన కొప్పుల మురళి ఉపాధి నిమిత్తం భద్రాచలంలో ఉంటుండగా, పాల్వంచ మండలానికి చెందిన నాలుగు రోజుల చిన్నారికి అవసరం కావడంతో రక్తదానం చేసి పలువురి అభినందనలు అందుకున్నాడు. భద్రాచలంలో డిగ్రీ చదువుతున్న సమయాన మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్టు స్థాపించిన మురళి.. తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు తానే కాకుండా ఇతరులకు రక్తదానం చేయిస్తున్నాడు. అలాగే, నిరుపేద విద్యార్థులు చదువుకునేలా ఫీజులు, పుస్తకాలు సమకూర్చే ఆయన, ప్లాస్టిక్ రహిత భద్రాద్రి కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు.

16న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 16న అథ్లెటిక్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి బి.నాగమణి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 16 ఏళ్ల పైబడిన మహిళలకు 100 నుంచి 5వేల మీటర్ల వరకు, లాంగ్ జంప్, షాట్‌పుట్ ఈవెంట్లు నిర్వహిస్తామన్నారు. ఇక్కడ ఎంపికైన వారిని హైదరాబాద్‌లో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామని, ఆసక్తి ఉన్న వారు వివరాలకు 90526 70288 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

విస్తృతంగా వాసవీ క్లబ్ సేవలు

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ రామకృష్ణ



మాట్లాడుతున్న ఇరుకుల్ల రామకృష్ణ

మహబూబాబాద్ రూరల్: వాసవీ క్లబ్ ఆధ్వర్యాన విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ ఇరుకుల్ల రామకృష్ణ తెలిపారు. మహబూబాబాద్ వాసవీ క్లబ్ (హోం), వాసవీ వనిత క్లబ్, వాసవీ క్లబ్ అనంతాద్రి లెజెండ్స్ నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం సోమవారం శ్రీవాసవి దేవాలయంలో నిర్వహించారు. నూతన కార్యవర్గాలతో రామకృష్ణ, డిస్ట్రిక్ట్ గవర్నర్ రవ్వా గీత ప్రమాణస్వీకారం చేయించగా రామకృష్ణ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యాన చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఇంకా విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. వాసవీ క్లబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు మాలె యోగేశ్వర్‌రావు, గార్లపాటి శ్రీనివాస్‌తో పాటు వేమిశెట్టి కిషోర్‌కుమార్, గార్లపాటి వెంకటేశ్వర్లు, వేంశెట్టి ఏకాంబరం, ఇమ్మడి కృష్ణమూర్తి, బొల్లం శ్రీనివాస్, వల్లాల రమేశ్, ప్రొద్దుటూరు గౌరీ శంకర్, వజినపెల్లి అనిల్ కుమార్, మాలె శ్రవణ్, చీదర వీరన్న, సోమ రజనీ కుమార్, సోమ రాధాకృష్ణ, పుల్లఖండం ప్రభాకర్, ప్రతాపని పుష్ప, శ్రీరాం సుష్మ, వేంశెట్టి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.